శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త



## స్కిల్ కేసులో సుప్రీం తీర్పుపై సంతోషం : సోమిరెడ్డి



**నెల్లూరు, జనవరి 15, ప్రభాతవార్త-వైద్యం** స్కిల్ డవలప్‌మెంట్ కేసులో నారా చంద్రబాబునాయుడుకి హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని, గత వైసీపీ ప్రభుత్వం వేయించిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టేయడం సంతోషదాయకమని తెలుగుదేశం పార్టీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి, మాజీ శాసనమండలి సభ్యుడు, సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కిల్ డవలప్‌మెంట్ కేసులో అబద్దాలు కోరైన జగన్ రెడ్డి ఆటలు సాగలేదన్నారు. పండుగ పూట తెలుగు ప్రజలందరికి ఇది శుభవార్త అన్నారు. జగన్ కావాలనే అన్యాయంగా పెట్టిన ఈ కేసులో నుంచి కూడా బాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందనేందుకు ఇది ఒక నిదర్శనం అన్నారు. గత ఐదేళ్ల అభివృద్ధి లేకపోగా అరాచకం రాజ్యమేలిందని సోమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

## సంక్రాంతి సంబరాలలో పాల్గొన్న ఎమ్మెల్యే



**కావలి, జనవరి15 ప్రభాతవార్త** కావలి రూరల్‌మండలం రుద్రకోట గ్రామంలో ఫైర్‌యూత్ ఆధ్వర్యం లో జరిగిన సంక్రాంతి సంబరాల లో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే దగుమాటిని ఫైర్‌యూత్ సభ్యులు ఘనస్వాగతంపలికి హారతులిచ్చారు. జనం నీరాజనం పలికారు. ఈ సందర్భంగా ముగ్గులపోటీలు, మ్యూజికల్ ఛైర్‌పోటీలు, కబడీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు ఎమ్మెల్యే దగుమాటి చేతులమీదుగా బహుమతులు అందచేశారు. ఎమ్మెల్యే మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తున్నాయన్నారు. ఇల్లులేని ప్రతిఒక్కరికి ఇళ్ల నిర్మించి ఇస్తామన్నారు. గ్రామంలోని ప్రతిరోడ్డును సిమెంటురోడ్డుగా మారుస్తామనన్నారు. ప్రతిసంవత్సరం ఇలాగే పోటీలు నిర్వహించాలని, అందరి మన్ననలను పొందాలని కోరారు.వెంట టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్దల నడుమ గంధ మహోత్సవం



**సంగం జనవరి 15 ప్రభాతవార్త** సంగం మండలం జెండాదిబ్బ గ్రామంలో వేడుకగా మేళతాళాలతో అత్యంత వైభవంగా హజరత్ మౌలాఅలీ ముష్కిల్‌కుషా వారి జన్మదినం పురస్కరించుకొని పంజతనేపాకు వారి గందమహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. హజరత్ ఖ్వాజా అబుల్ అతాషాహ్ మొహమ్మద్ ఖాదర్‌బాషా మెయినీ ఖాలీది వజూది షంసి చిష్టిపుల్ ఖాదరి ఆధ్వర్యంలో శిష్యబృందంతో ఇంటి దగ్గర నుండి వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో మురిదులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో సహపంక్తి బోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహెఫిలేసమా కూడా నిర్వహించారు. పెద్దఎత్తున బానా సంచిని కాల్చారు. భక్తి గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## నెల్లూరు సిటీ కార్యాలయంలో కనుమ సంబరాలు



**నెల్లూరు రూరల్, జనవరి 15, ప్రభాతవార్త** నెల్లూరు రాంజీ నగర్ వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ కార్యాలయంలో కనుమ పండుగ సంబరాలు సందడిగా సాగాయి. కనుమ సందర్భంగా మహిళలు చేసిన కోలాట నృత్యాలను వైసిపి సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తిలకించి, పార్టీ నాయకులు, మిత్రులతో కలిసి సందడిగా గడిపారు. అనంతరం దూడూ బసవన్నలు చేసిన విన్యాసాలతో సరికొత్త పండుగ శోభను సంతరించుకుంది. బసవన్నలను చంద్రశేఖర్ ఆప్యాయంగా దగ్గరికి తీసుకొని, వాటికి పండ్లను తినిపించి, సందడిగా వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా యువజన అధ్యక్షులు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున పాల్గొన్నారు.

## వైభవంగా పుట్టాలమ్మ తల్లి గ్రామోత్సవం



**బుచ్చి జనవరి 15 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాల గ్రామంలో శ్రీపుట్టాలమ్మ తల్లి గ్రామోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఏటా రేబాలలో ప్రజలు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహిస్తారు. అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా నిర్వహించారు. అమ్మవారిని పరిమళ పుష్పాలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. అడుగడుగున గ్రామోత్సవంలో అమ్మవారికి పూజలుచేసి నైవేద్యాలు సమర్పించారు. కొబ్బరి కాయాలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీపుట్టాలమ్మ తల్లిని మండపంలో కొలువు తీర్చారు. పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చి శ్రీపుట్టాలమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు భక్తులకు తీర్ధప్రసాదాలు అందజేశారు.అమ్మవారి గ్రామోత్సవంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## గ్రామోత్సవంలో ఇద్దరు చిన్నారులకు గాయాలు



**కావలి, జనవరి15 ప్రభాతవార్త** అమ్మవారి గ్రామోత్సవంలో కావలి నార్త్‌జనతాపేటకు చెందిన చీమల దీన్నే బాలికపైన తారాజువ్వ పడడంతో వైద్యశాలకు తరలించారు. మూడు కుట్లుపడ్డాయి. ఆలయంవద్ద వైకుంఠపురానికి చెందిన ఒక బాలుడు దగుమాటి రిత్విక్‌కు ఊపిరి ఆడక వైద్యశాలకు తరలించారు. ఇద్దరి పరిస్థితి బాగానే ఉండడంతో తల్లిదండ్రులు ఊరటచెందారు.

## కుటుంబ కలహాలతో యువకుడు మృతి



**అనుమసముద్రంపేట, జనవరి15, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని ఎన్3 రిపోర్టర్ సయ్యద్ రబ్బాని (30) కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరివేసుకొని బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిరోజు లుగా తరచూ కుటుంబంలో తగాదాలు జరుగుతున్నట్లు చుట్టుప్రక్కల వారు చెబుతున్నారు. బుధవారం భార్యాభర్తల మధ్య వాదనలు పెరగడంతో మనస్థాపానికి గురై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ సైదులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మన్నారు.

## వైభవంగా శ్రీ భ్రమరాంబికా సమేత మల్లేశ్వర స్వామి వారి తెప్పోత్సవం



**నెల్లూరు జనవరి 15, ప్రభాతవార్త వైద్యం** నగరంలోని మైపాడు గేట్, నవాబుపేట వెలసియున్న శ్రీ భ్రమరాంబిక సమేత శ్రీ మల్లేశ్వర స్వామి పార్వేట తెపోత్సవ కార్యక్రమం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది.భ్రమరాంబిక సమేత శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయం ఉత్సవమూర్తులను తెప్పోత్సవ ప్రాంతంలో కొలువు తీర్చి పూజలు నిర్వహించా రు. కొలువుదీరిన స్వామివారి ఉత్సవమూర్తులను మంత్రి నారాయణ దర్శించుకున్న అనంతరం ఊరేగింపుగా తీసుకొచ్చి తెప్పలో కొలువు తీర్చారు.ఈ సందర్భంగా నారాయణకు దేవస్థానం అర్చకులు వేదపండితులు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తదితరులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికి ఆశీర్వచనాలు చేశారు. అనంతరం మంత్రి నారాయణ తెప్పలో కొలు వుదీరిన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వదించారు. ముందుగా మంత్రి నారాయణ పత్తి వారి సత్రం లో కొలువుదీరిన శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారు, శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఉత్సవమూర్తులను, భవానీ నగరు లోవెలసీయున్న శ్రీశ్రీశ్రీ భవాని అమ్మవారిని, శ్రీ దుర్గమ్మను, శ్రీశిరిడి సాయి బాబా ఆలయాన్ని,ఆంజనేయ స్వామి వారిని, దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు..ఆనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా పెద్ద సంఖ్యలో విచ్చేసినభక్తుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామన్నారు..గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో బురదమయంగా ఉన్న కాలును శుభ్రపరిచి ఘాట్లను నిర్మించడం జరిగిందన్నారు అనంతరం ప్రభుత్వం మారడంతో ఇక్కడ ఐదేళ్లుగా ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. మున్సిపల్ శాఖ, దేవాదాయ శాఖ పోలీస్ శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు చర్చించి తెప్పోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించడం జరిగిందన్నారు. స్వామి వారి తెప్పోత్సవాల్లో ప్రతి ఒక్కళ్ళు పాల్గొనేందుకు అవసరమైన ఏర్పాటు చేయాలని ఆదే

### తెపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నారాయణ

శించడం జరిగిందన్నారు..అధికారుల సమన్వయంతో తెప్పోత్సవాన్ని విజయవంతం చేశారని అభినందించారు మున్సిపల్ శాఖ దేవాదాయ శాఖ పోలీస్‌శాఖ వివిధశాఖల సమన్వయంతో తెప్పోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు.. టిడిపి జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ గతంలో నారాయణ గారి సహకారంతో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఆయన చొరవతోనే గాట్లను నిర్మించి బురదతో కూరుకుపోయిన కాలువను సుందరంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు.నుడా ఛైర్మన్ కోటంరెడ్డి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ నారాయణ గారి నాయకత్వంలో మరింత అభివృద్ధితో ముం దుకు సాగుతామని తెలిపారు. ముందుగా మాజీ కార్పొరేటర్ కొత్తూరు శైలజ నివాసంలో తేనె టి విందులో మంత్రి నారాయణ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ నూడ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరా శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాజీ జడ్పిటిసి విజేతారెడ్డి విజయభాస్కర్ రెడ్డి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఆలయ ఈవో కవితపోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, స్థానిక టిడిపి జనసేన నాయకులు కార్యకర్తలుపెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## పెద్దల పండుగ ఏర్పాట్లు బ్రహ్మాండం



**నెల్లూరు, జనవరి 15, ప్రభాతవార్త-వైద్యం** సమాధుల తోటలో పెద్దల పండుగ ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయిన, గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదని, రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. మంగళవారం సంక్రాంతి సందర్భంగా సమాధుల తోటలో నిర్వహించే పెద్దల పండుగను మంత్రి నారాయణ, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్రాంతి అంటే పేదల పండుగని, రైతులు తాము పండించిన ధాన్యాన్ని ఇళ్లకు తీసుకొచ్చే నైవేద్యంగా సమర్పించుకుంటారన్నారు. సమాధుల తోటలో పెద్దల పండుగ ఏర్పాట్లను తాను స్వయంగా చూశానని, మున్సిపల్ అధికారులు చాలా చక్కగా బ్రహ్మాండంగా చేశారన్నారు. 2014-19 మధ్య కాలంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో అప్పటి మేయర్ అబ్దుల్ అజీజ్ చొరువతో పెద్దల పండుగ జరుపుకునేందుకు వచ్చే ప్రజల కోసం అనేక మంచి కార్యక్రమాలు చేశామన్నారు. అలాగే 3,4,6 డివిజన్ల పరిధిలో కనుమ పండుగ సందర్భంగా జరిగే శ్రీ భ్రమరాంబిక సమేత మల్లేశ్వర స్వామి తెప్పోత్సవం ఏర్పాట్లను కూడా చాలా భాగా చేశారన్నారు. జాఫర్ సాహెబ్ కాలువ ప్రాంతంలో 2014 కు ముందు చాలా దారుణంగా ఉండేదని అజీజ్ సహకారంతో భక్తుల కోసం ఘాట్లను నిర్మించామని మంత్రి గుర్తు చేశారు. ఐదు సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ఎవరిపై కేసులు పెడదామా..? ఎవరిని జైల్లో పెడదామా అని ఆలోచించారే తప్ప వారికి అభివృద్ధి తెలియదన్నారు. బోడి గాడి తోట పేరును మార్చాలని, మంచి పేరు పెట్టాలని స్థానికుల కోరడం జరిగిందని, వారి అభిష్టం మేరకు త్వరలో మంచి పేరును నామకరణం చేయనున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఇక ఈ ప్రాంతంలో ప్రతి ఏడాది అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు వెళ్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ, జనసేన నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## పెద్దపవని ఫ్లైఓవర్‌ను అండర్‌పాస్‌గా మారుస్తాను : ఎమ్మెల్యే



**కావలి, జనవరి15 ప్రభాతవార్త** ఎవరికి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలకు ఎలాంటి అసౌకర్యంలేనివిధంగా వైకుంఠపురంవద్ద ఫ్లైఓవర్‌కి బదులుగా అండర్‌పాస్‌ను నిర్మిస్తానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. గ్రామదేవత శ్రీ కళుగోళశాంభవిమాత తిరునాళ్లలో భాగంగా సినిమా హాల్‌రోడ్డులో అత్యంత వైభవంగా ఏర్పాటుచేసిన స్నేహయూత్, ఫ్రెండ్లీయూత్ సాంస్కృతిక కార్యక్రమాలలో ఎమ్మెల్యే దగుమాటి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. నిర్వాహకులు ఆయనకు ఘనస్వాగతం పలికి పెద్దఎత్తున సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామదేవత శ్రీ కళుగోళశాంభవిమాత ఆశీస్సులు ప్రతిఒక్కరిపై ఉండాలని కోరారు. అమ్మవారు ఆశీస్సులు లభిస్తే వచ్చే జనవరి లోపు వైకుంఠపురంవద్ద అండర్‌పాస్ నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఈ అండర్‌పాస్‌వల్ల ఉత్సవాలు, జాతరలకు ఎలాంటిఇబ్బందులు ఉండవన్నారు. అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, యువనాయకుడు మంత్రి నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ప్రధాని నరేంద్రమోడి ఆశీస్సులతో కావలి కనకపట్నం కాబోతుందన్నారు. కావలి నియోజకవర్గ ప్రజలు నావెంటే ఉన్నారన్న నమ్మకంతో చంద్రబాబు అడిగిన వనరులను సమకూరుస్తున్నారన్నారు. మీరువేసిన ఓటు వృధాకాకుండా మంచి పాలన అందిస్తారన్నారు. కావలిని కాపుకాస్తానన్నారు. ఉత్సవాల సమయంలో ఇలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసి ప్రజలకు వినోదాన్ని అందిస్తున్న స్నేహయూత్, ఫ్రెండ్లీయూత్ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. కళాకారులను ఉత్తేజపరుస్తూ అభినందించారు. కావలి ప్రాంతాన్ని పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దుతున్నామని, యువతకు ఉద్యోగాలు వస్తాయని తాను ఎన్నికల ప్రచారంలో ఏమి హామీలిచ్చానో అవి నెరవేరేవిధంగా పరిపాలన సాగిస్తున్నానన్నారు. ఈ ప్రాంతం యువతకు ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ఎమ్మెల్యే దగుమాటివెంట పట్టణ అద్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధానకార్యదర్శి జ్యోతిబాబురావు, టిడిపి లీగల్‌సెల్ కావలి నియోజకవర్గ కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, బుర్లా శ్రీధర్‌రెడ్డి, బిజెపినేత పల్లపు చిట్టిబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి అలేఖ్య, మొగిలి కల్లయ్య, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గెలుపు ఓటమిలను సమానంగా తీసుకోవాలి





**కోవూరు జనవరి 15 ప్రభాతవార్త :** ప్రతి క్రీడాకారుడు గెలుపు ఓటమిలను సమానంగా తీసుకోవాలని గ్రామ సర్పంచ్ నలుబోలు శ్రీవాణి తెలిపారు. కోవూరులోని పోతిరెడ్డిపాలెం గ్రామ పంచాయతీ షుగర్ ఫ్యాక్టరీ ఎంప్లాయిస్ కాలనీలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఇటువంటి పోటీలను గత మూడు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న నిర్వాహకులు జానా వెంకటేశ్వర్లు గౌడ్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. గ్రామంలో నిర్వహిస్తున్న క్రీడలు యువత పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని కలిగి ఇటువంటి పోటీల్లో తరచుగా పాల్గొనాలని ఈ సందర్భంగా ఆమె యువతకు పిలుపునిచ్చారు. ఇంకా ప్రముఖ న్యాయవాది సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, గాజుల మల్లికార్జున రావు, జొన్నవాడ దేవస్థాన మాజీ ట్రస్టీ సుప్రజ, నిర్వాహకులు జానా గౌడ్ పలు సూచనలు చేశారు.

**– విజేతలు వీరే..** గత మూడు రోజులుగా సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ క్రికెట్ పోటీల్లో ప్రథమ స్థానాన్ని వీకేఎం 11 కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానాన్ని లెజెండ్ 11 , తృతీయ స్థానాన్ని రాధాపుత్ర 11, నాల్గవ స్థానాన్ని పెన్నా పవర్ టీమ్ లు కైవసం చేసుకున్నాయి. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా దుర్గ, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా రాణా ప్రవీణ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా బాలు కైవసం చేసుకున్నారు. ప్రథమ బహుమతి సాధించిన జట్టుకు రూ. 15 వేలు, కప్పు, ద్వితీయ బహుమతి సాధించిన జట్టుకు రూ. 10 వేలు, కప్పును అందజేసి.. వ్యక్తిగతంగా క్రీడాకారులకు మెడల్స్‌ను కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళ్ల శైలజ, అపర్ణ, తదితరులు ఉన్నారు.

# పశువుల పండుగ కనుమ

-గ్రామాల్లో కనిపించే ఈ ఆచారాలు మీకు తెలుసా..?

**ఉదయగిరి, జనవరి 15, ప్రభాతవార్త :** కనుమను పశువుల పండుగగా వ్యవహారిస్తారు. పంటలు చేతికి అందడంలో తమకు సహాయపడిన పశుపక్షాదులను పూజిస్తారు. సంవత్సరంలో మిగిలిన రోజులన్నీ తమతో పాటు కష్టపడి పని చేసిన ఆవులను, ఎద్దులను, బర్రెలను పూజించి ప్రేమగా చూసుకునే రోజు ఇదే. పక్షులు కూడా రైతన్ననేస్తాలే. అందుకే వాటి కోసమే అన్నట్లు ఇంటి గుమ్మానికి ధాన్యపు కంకులు వ్రేలాడ దీస్తారు. సంక్రాంతి వరసలో వచ్చే చివరి పండుగను కనుమ పండుగ అంటారు. దీన్నే పశువులు పండుగ అని కూడా అంటారు. ఒక సంవత్సరం పాటు తమ యజమానులకు సహాయకరంగా ఉండే మూగజీవులను ఆరాధించే రోజు ఈ కనుమ పండుగ. పశుపక్షాదులకి గౌరవాన్ని సూచించే పండుగలా కనుమ ప్రసిద్ది. ఆ రోజు ఇంటి కొకరు చొప్పున తెల్లవారక ముందే ఒక కత్తి, ఒక సంచి తీసుకొని సమీపంలో ఉన్న అడవికి బయలు దేరుతారు. అక్కడ దొరికే నానా రకాల వన మైలికలు, ఔషధ మొక్కలు, సేకరిస్తారు. కొన్ని చెట్ల ఆకులు, కొన్ని చెట్ల బెరుడులు కొన్ని, చెట్ల పూలు, వేర్లు కాండాలు, గడ్డలు ఇలా చాలా సేకరిస్తారు. కొన్ని నిర్ధిష్టమైన చెట్ల భాగాలను మాత్రమే సేకరించాలి, అనగా, మద్ది మాను, నేరేడి మానుచెక్క, మోదుగ పూలు, నల్లేరు, మారేడు కాయ, ఇలా అనేక మూలికలను సేకించి ఇంటికి తీసుకొచ్చి వాటిని కత్తితో చిన్న ముక్కలుగా కత్తిరించి, ఆ తర్వాత దానికి పెద్దమ ఒత్తంలో ఉప్పు చేర్చి రోట్లో వేసి భాగా దంచుతారు. అదంతా మెత్తటి పొడిలాగ అవుతుంది. దీన్ని ఉప్పు చెక్క అంటారు. ఇది అత్యంత ఘాటైన మధుర మైన వాసనతో ఉంటుంది. దీన్ని పశువులకు తినిపించాలి. ఇదొక పెద్ద ప్రహసనం. అవి దీన్ని తినవు. అంచేత ఒక్కొక్క దాన్ని పట్టుకొని దాని నోరు తెరిచి అందులో ఈ ఉప్పు చెక్కను చారెడు పోసి దాని నోరు మూస్తారు. అప్పుడు ఆ పశువులు దాన్ని మింగుతుంది. ఇలా ఒక్క దానికి సుమారు రెండు మూడు దోసిళ్ల ఉప్పు చెక్కను తినిపిస్తారు. గొర్రెలు మేకలు ఐదే కొన్ని వాటంతటే తింటాయి. లేకుంటే వాటిక్కూడ తినిపిస్తారు. ఏడాది కొకసారి ఈ ఉప్పు చెక్కను తినిపిస్తేనే అది పశువులకు సర్వరోగ నివారని అని వీరి నమ్మకం. అది నిజమే కావచ్చు. ఎంచేతంటే అందులో ఉన్నవన్ని ఔషధాలు, వన మూలికలే గదా. ఆ తర్వాత పశువులన్నింటిని పొలాల్లో బావుల వద్దకు గాని, చెరువుల వద్దకు గాని తోలుకు పోయి, స్నానం చేయించి లేదా ఈత కొట్టించి ఇంటికి తోలుకొస్తారు. ఆ తర్వాత వాటి కొమ్ములను, పదునయిన కత్తితో భాగా చెలిగి వాటికి రంగులు పూస్తారు. మంచి కోడెలున్న వారు వాటి కొమ్ములకు ఇత్తడి కుప్పెలు తొడిగి, మెడలో మువ్వల పట్టీలు మూతికి మూజంబరాలు అలంకరిస్తారు. అన్నింటికి కొత్త పగ్గాలు వేస్తారు. ఈ సమయంలో చేలన్నీ పరిగిలి పోయి ఉన్నందున పశువులన్నింటిని వదిలేస్తారు. సాయంకాలం ఊరు ముందున్న కాటమరాజును పున:ప్రతిష్ఠించి ఊరిలో ప్రతి ఇంటి నుండి ఆడవారు కాటమరాజు ముందు పొంగలి పెడ్తారు. పొంగలి అంటే కొత్త కుండలో కొత్త బియ్యం, కొత్త బెల్లం వేసి అన్నం వండడం. ఒక నెల ముందు నుండే కామటరాజు ముందు ఆ దారిన వచ్చి పోయే ఊరి వారు రోజుకొక కంపో, కర్రో తెచ్చి అక్కడ కుప్పగ ఆవేస్తారు. ఈ రోజుకు అది ఒక పెద్ద కుప్పగా తయారై ఉంటుంది. దాన్ని చిట్లా కుప్ప అంటారు. చీకటి పడే సమయానికి పొంగిళ్లు తయారై ఉంటాయి. ఊరి చాకలి కాటమరాజు పూజ కార్యక్రమం ప్రారంభించి దేవుని ముందు పెద్ద తళిగ వేస్తారు. అనగా ప్రతి పొంగలి నుండి కొంత తీసి అక్కడ ఆకులో కుప్పగా పెడతారు. పూజానంతరం మొక్కున్న వారు, చాకలి చేత కోళ్లను కోయించు కుంటారు. అప్పటికి భాగా చీకటి పడి ఉంటుంది. అప్పటికి పశుకాపరులందరూ ఊరి పశువులన్నింటిని అక్కడికి తోలుకుని వస్తారు. పూజారి అయిన చాకలి తుళిగలోని తొంగలిని తీసి ఒక పెద్దముద్దగా చేసి అందులో సగం పోలిగాని కిచ్చి(పశువుల కాపరి) తినమని చెప్పి, తర్వాత అక్కడున్న చిట్లాకుప్పకు నిప్పు పెడతారు. పెద్ద మంటపైకి లేవగా పోలిగాడు పశువులన్నింటిని బెదరగొట్టి.. చెదర గొట్టతాడు. అవి బెదిరి చేలెంబడి పరుగులు తీస్తాయి. ఆ సమయంలో పశువులను బెదర గొడుతున్న పోలిగాని వీపున చాకలి తన చేతిలో ఉన్న మిగిలిన సగం పొంగలి ముద్దన అతని వీపు మీద కొడతాడు. దానిని పిడుగు ముద్ద అంటారు. వాడు పరిగెడుతాడు. ఆ తర్వాత అందరూ అక్కడ మిగిలిన తళిగలోని ప్రసాదాన్ని తిని మొక్కులు తీర్చుకొని చిట్లకుప్ప మంట వెలుగులో తమ పొంగళ్లను తీసుకొని తాపీగా ఇళ్ల కెళతారు. ఆ విధంగా పశువుల పండగ పరిసమాప్తి అవుతుంది.

## ఎంతోమంది విద్యార్థులకు విద్యాదానం చేసిన డాక్టర్ డిఆర్



**కావలి, జనవరి15 ప్రభాతవార్త :** బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికోసం విద్య ఒక్కటే ఏకైక మార్గమని నమ్మి ఆచరించి చూపించిన విద్యాదాత, మహనీయుడు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి అని విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ డిఆర్ 15వ వర్ధంతి వేడుకలు కావలి జవహర్‌భారతి డిగ్రీకళాశాల పార్క్‌లోని స్థూపంవద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వోదయ రెక్టార్ దొడ్ల మాట్లాడారు. ఎంతోమంది విద్యార్థులకు విద్యాదానం చేసిన విద్యాదాత డాక్టర్ డిఆర్ అన్నారు. ఈ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించిన వేలాదిమంది దేశ,విదేశాలలో గౌరవప్రదమైన జీవితాన్ని సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యంనాయుడు, స్వయంఉపాధికోర్సుల సంచాలకులు డాక్టర్ రాయి మాల్యాద్రి, లక్ష్మీవినయ్‌కుమార్‌రెడ్డి, చాకలికొండ శారద, డాక్టర్ పి.ప్రసాదరెడ్డి, డాక్టర్ ఎం.చంద్రశేఖర్, డాక్టర్ డి.వెంకటరావు, నల్లూరు రామకృష్ణ, ఎం.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## జల-ఉభయచర జీవులను కాపాడాలి

### కలయిక విజ్ఞానకేంద్రం కన్వీనర్లు



**కావలి, జనవరి15 ప్రభాతవార్త :** జల-ఉభయచర జీవులను కాపాడాలని కావలి 'కలయిక' విజ్ఞానకేంద్రం కన్వీనర్లు జి.రాంప్రసాద్, యిలింద్ర లావణ్య, సలహాదారులు చాకలికొండ శారదలు డిమాండ్ చేశారు. బుధవారం వారు కావలి సమీపంలోని తుమ్మలపెంట సముద్రతీరంలో మృతిచెందిన తాబేళ్లనుచూసి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రకృతి సమతుల్య తను కాపాడేందుకు తాబేళ్లను కాపాడాలని తుమ్మలపెంట సముద్ర తీరంలో మృతిచెందిన వందలాది తాబేళ్ల చోటుచేసుకోవడం ఎంతైనా విచారకరమన్నారు. జీవకారుణ్యంలేక వలలకు చిక్కుకున్న వందలకొద్ది తాబేళ్లను జాలరులు కాపాడకపోవడం బాధాకరమన్నారు. వందలాది తాబేళ్ల మృతిచెందడాన్ని ప్రత్యక్షంగా చూడడంతో వారు కలతచెందారు. తాబేళ్లను కాపాడమని కోరినా అక్కడ ఎవరూ ముందుకురాకపోవడం విచారకరమన్నారు. ప్రతి డిసెంబరు నెలలో సంతానోత్పత్తికోసం ఉభయచరాల్లో భాగమైన తాబేళ్ల సముద్రతీరానికి రావడం ప్రకృతి సహజమన్నారు. ప్రకృతి సమతుల్యత దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత ఈ భూమిపై నివసించే ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అయితే, జాలరులు తమ వృత్తిలో భాగంగా చేపలుపట్టడానికి వలలువేస్తే ఆ వలల్లో తాబేళ్ల చిక్కుకున్నపుడు తప్పించడంలేదన్నారు. వాటిని రక్తగాయాలయ్యేలా వలనుండి విసిరికొట్టడంతో వందలాది తాబేళ్ల మృతిచెందుతున్నాయన్నారు. తాబేళ్లను రక్షిద్దామని ఎంతమందిని బ్రతిమిలాడినా ఎవరూ ముందుకు రాలేదన్నారు. అక్కడ ఉన్న ఒక తాబేలు తలపై ఇనుపరాడ్డుతో కొట్టిన గాయంనుండి రక్తం వస్తుంటే దానిని తీసుకురావడం జరిగిందన్నారు. ఫిషరీస్ సంస్థకు రీహ్యాబిటేషన్ కేంద్రానికి ఫోన్‌చేస్తే రెండుగంట తర్వాత వచ్చి ఆ తాబేలును కాపాడారన్నారు. తాబేలును కాపాడడంలో కృషిచేసిన కావలి పశువైద్యులకు రాంప్రసాద్, లావణ్యలు ధన్యవాదాలు తెలిపారు. కావలి మత్స్యకార అధికారులు, ఎమ్మెల్యే, ఆర్డీఓ తగు ఆదేశాలిచ్చి తాబేళ్లను కాపాడేవిధంగా చర్యలు చేపట్టాలని వారు కోరారు.

## వింజమూరులో మెగా రక్తదాన శిబిరం




**వింజమూరు, జనవరి15,ప్రభాతవార్త:** వింజమూరులోని శ్రీవివేకానంద జూనియర్ కళాశాల ప్రాంగణంలో మకర సంక్రాంతి సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వీరదిమ్మె మనోహర్‌రెడ్డి, బుర్ర వంశీరెడ్డిల జ్ఞాపకార్థం వారి మిత్ర బృందం మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. తన మిత్రులు ఆకాంక్షించిన ఆశయాల మేరకు మిత్ర బృందం వారి ఆశయాలను సాధించేందుకు ఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ శిబిరానికి 200మంది పాల్గొని రక్తం దానం చేశారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఒకరు చేసిన రక్తదానం మరొకరికి ప్రాణదానంగా మారుతుందన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దూరు గోపాల్‌రెడ్డి, వైద్యాధికారులు, సిబ్బంది , మిత్రబృందం పాల్గొన్నారు.

## ఘనంగా కనుమపండుగ వేడుకలు

**వింజమూరు, జనవరి15,ప్రభాతవార్త:** మండలంలో సంక్రాంతి సందర్భంగా మూడవ రోజు అయిన కనుమ పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ పండుగను పశువుల పండుగగా జరుపుకోవడం ఆనవాయితీ. ఈసందర్భంగా మండలంలో రైతులు తమ వ్యవసాయ పరికరాలను, పశువులను శుభ్రం చేసి వాటిని అలంకరించి పండుగను ఘనంగా నిర్వహించారు.

## చెన్నకేశవస్వామికి పట్టువస్త్రాలు



**వింజమూరు, జనవరి15,ప్రభాతవార్త:** వింజమూరులోని శ్రీదేవి,భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి వారికి గోదాదేవికి, , విగ్నేశ్వరుడికి సంక్రాంతి సందర్భంగా వింజమూరులోని నడిమూరుకు చెంఆఇన దివంగత యల్లాల చిన్నవెంకటరెడ్డి-పుల్లమ్మ తనయులు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వారి కుమారులు యల్లాల శ్రీనివాసులురెడ్డి-పద్మావతమ్మ, యల్లాల రఘురామిరెడ్డి-రజని, ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి-మంజుల పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రజలు సుఖసంతోషాలతో, సిరిసంపదలకోసం లోక కళ్యాణార్థం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు గణపం రమణారెడ్డి, గణపం సుదర్శన్‌రెడ్డి, మనోజ్, అనిల్, పునీత్, రిత్విక్, ఇతర భక్తులు పాల్గొన్నారు.

## 17న శ్రీకృష్ణ దేవరాయ 554వ జయంతి వేడుకలు



**ఉదయగిరి, జనవరి 15, ప్రభాతవార్త :** ఈనెల 17వ తేదీ శ్రీకృష్ణ దేవరాయ 554వ జయంతి వేడుకలు వైభవంగా జరుగనున్నట్లు ఉదయగిరి యాదవ చైతన్య వేదిక నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. దుత్తలూరు మండలం నరవాడలోని యాదవ వంశ బృందావనంలో శుక్రవారం ఉదయం 10గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి యాదవ సోదరులు బాధ్యతతో కదిలి రావాలని తిరుణాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## కనుమ దేవుడు కాటమరాజు..!

### - కనుమ పండుగకు, కాటమ రాజుకు దగ్గరి సంబందం ఉంది



**ఉదయగిరి, జనవరి 15, ప్రభాతవార్త :** కాటమరాజు పశువుల సంరక్షణ కొరకు పుల్లరి విషయంలో మాట తప్పిన సింహపురి రాజులతో 1282 లో పాలేటి నది ఒడ్డున యుద్ధం చేసి విజయం సాధించి పశువుల దేవుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. కనుమ నాడు ప్రతి ఊరిలో కాటమరాజు విగ్రహాన్ని పున:ప్రతిష్ఠించి ఆయనకు కొత్త కుండలో బియ్యం, బెల్లం వేసి వండిన పొంగలిని సమర్పిస్తారు. పశువుల్ని నీళ్లతో శుభ్రం చేసి, కొమ్ములు జివిరి కుప్పెలు తొడిగి, నీలి రంగు పూసి, ప్రభలు కట్టి ఊరేగించి సాయంత్రం ఊరి దగ్గర చిట్లాకుప్ప వేసి కాటమరాజుకు బోనాలు సమర్పించి చిట్లాకుప్పలకు నిప్పుపెట్టి పవువుల పండుగ నిర్వహిస్తారు. పాడి సంపద, పంటలు సమృద్ధి ఐతే మరింత ఘనంగా పూజలు చేస్తామని కాటమరాజుకు మొక్కులు సమర్పించుకుంటారు. కాటమరాజు పూర్వీకులు శ్రీ కృష్ణ భగవానుడి వంశానికి చెందిన వారు. వీరు పెద్దిరాజు పెద్దమ్మలకు 12-02-2017 ధాతనామ సంవత్సరం పాల్గుణ శుద్ధ పంచమి నాడు బసవ కళ్యాణ పట్టణంలో జన్మించారు. వీరి భార్య మర్లవారి వీర గంగ. వీరికి ఊర్లు గొడ యలమంచిలి నందు 1250 లో పట్టాభిషేకం జరిగింది. వీరు శ్రీ చంద్ర దేవ అని ముద్రించిన నంది కాసులు అను నాణెములను ఉపయోగించారు. యరగడ్డ పాటి యుద్ధము లో కాల్బలము అశ్వదళము గజాబలమే కాకుండా ఆవులు ఎద్దులు కూడా వీరోచితంగా పోరాడాయి. యుద్ధం నాల్గవ రోజు విష్ణు అంశ గల బొల్లావు వీర మరణం పొందినది. కాటమరాజు సైన్యం గంగమ్మ తల్లి శ్రీ కృష్ణుల వారి ఆశీస్సులతో యుద్ధ విజయం సాధించారు. ఆనాటి వీరుల సాహసాలు జానపదుల నోళ్ళలో ఇప్పటికి గానం చేయబడుతున్నాయి.

## చట్టసభలలో వలేటివారిపాలెం నుంచి ముగ్గురుకు ప్రాతినిధ్యం

### అభివృద్ధికి చేయండి- ప్రజల మనసుల్లో నిలవండి

**వలేటివారిపాలెం జనవరి 15, ప్రభాతవార్త :** రాష్ట్ర చట్టసభల్లో కందుకూరు నియోజకవర్గం నుంచి ప్రజాసమస్యలపై గళము విప్పే అదికారం వలేటివారిపాలెం మండలవాసులకు దక్కింది.ఇది చరి త్రలో నిలిచేపోయే అంశం.నియోజకవర్గంలో కందుకూరు,ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాలు ఉన్నాయి.అయినప్పటికిని ఎమ్మెల్యేతోపాటు ఇద్దరు ఎమ్మెల్సీలు వలేటివారిపాలెం మండలానికి చెందినవారు కావడం గమనార్హం. ఈ అరుదైన అవకాశం దక్కిన చట్టసభల ప్రతినిధులు సుపరిపాలన అందించి ప్రజల గుండెల్లోనూ,చరిత్రలోనూ నిలవాలని పలువురు కోరుతున్నారు.వలేటివారిపాలెం మండలవాసులే: బడేవారిపాలెం నివాసి ఇంటూరి నాగేశ్వరరావు,శాసనమండలిలో ఉమ్మడి ప్రకాశంజిల్లా స్దానిక సంస్దల ప్రతినిధుల సభ్యుడిగా పోలినేనిపాలెంకు చెందిన తూమాటి మాధవరావు, తూర్పు రాయలసీమ నియోజకవర్గపట్టభద్రుల సభ్యుడిగా అత్తంటివారిపాలెంకు చెందిన కంచర్ల శ్రీకాంత్‌లు ఎంపికయ్యారు.ఎమ్మెల్సీ శ్రీకాంత్ శాసనమండలిలో విప్‌గానూ, కుప ్రం తెదేపా ఇన్‌చార్జీగానూ వ్యవహరిస్తుండడంతో అధినాయకులతో ప్రత్యక్ష సంబందాలు మెండుగా ఉండడం గమనార్హం.పైగా ముగ్గురూ యువకులే. ఇంతటి అరుదైన అవకాశం దాదాపు రా ష్ట్రంలో ఏ మండలానికి రాకపోవొచ్చు.మండలానికి వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మండలంతోపాటు నియోజక వర్గాన్ని పారిశ్రామికంగా ముందుకు తీసుకపోవాలని ప్రజలు సూచిస్తున్నారు.సాగునీటి ప్రాజక్టులు తెప్పించ ండి- పారిశ్రామికీకరణకు కృషిచేయండి:కందుకూరు నియోజకవర్గం బాగా వెనుకబడిన ప్రాంతం.పైగా వర్షాభావప్రాంతం.రాళ్లపాడు ప్రాజక్టు మినహా ఎటువంటి సాగునీటి వనరులులేవు. వెలుగొండ,సోమశిల ప్రాజక్టుల నీటిని కందుకూరు ప్రాంతానికి తీసుకరావాలన్న ప్రతిపాదనలు ఆచరణలో సఫలీకృతం కాలేదు.పలుకుబడి,పరపతి ఉపయోగించి కందుకూరు ప్రాంతాన్ని పారిశ్రామికీకరణ చేయాలని పలువురు సూచిస్తున్నారు.కందుకూరు ప్రాంతమంతా దాదాపు ఒక లక్ష ఎకరాలకి పైగా సాగునీటి వసతి లేక మెట్టపైర్లు వేస్తున్నారు. సాగునీటి వసతి కల్పిస్తే ఈ పొలాలన్ని సస్యశ్యామలమౌతాయి. సోమశిల ,రాళ్లపాడు, వెలుగొండ జలాలను కందుకూరు నడిపించాలని కోరుతున్నారు.తద్వారా కందుకూరు నియోజవర్గాన్ని పారిశ్రామికంగానూ,సేవారంగంలోనూ,రవాణారంగంలోనూ ప్రగతిపథంలో నడిపించొచ్చు. కందుకూరుకు రైల్వేలైన్ వేయించవచ్చు.రాళ్లపాడు ప్రాజక్టుకు సోమశిలజలాలను తరలించొచ్చు.రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపుద్వారా కందుకూరుసమీపంలోని ప్రాంతాలకు సైతం తాగునీటిని,సాగునీటిని అందించ వచ్చునిపొగాకు రైతుసంఘం నాయకుడు తానికొండ వెంకటరమణయ్య తెలిపారు.పధానంగా కందుకూరు పట్టణం ఏళ్లతరబడి ఆశించినరీతిలో అభివృద్ధి చెందలేదు.పట్టణంలో రోడ్లు విస్తరణ ఎండ మావిగా నిలిచిపో యింది.పట్టణానికి ఉత్తరంవైపు బైపాస్ రోడ్ అడ్రసులేదు.కనీసం టౌన్‌లో డివైడర్‌లు కూడా లేవు. దురదృ ష్టకరం. దీనితో పట్టణంలో నిత్యం ట్రాపిక్ ఇబ్బంది అంతాఇంతా కాదు.మాలకొండ ఆలయం సైతం ఆశించిన రీతిలో అభివృద్ధికినోచుకోలేదు. ఇటీవల కాలంలో నిర్వహణ లోపభూయిష్టంగా తయారైంది. ఇటువంటి సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాల్సిందిగా పలువురు కోరుతున్నారు.యువనాయకులైన చట్టసభసభ్యులు ప్రజలు తమకిచ్చిన అధికారం,సమయాన్ని కాలయాపనతో వృధాచేయొద్దని సూచిస్తున్నారు.ఆ దిశగా ఆలోచించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## వెంకటయ్య మృతి టీడీపీకి తీరని లోటు



**ఉదయగిరి, జనవరి 15, ప్రభాతవార్త :** సీతారాంపురం మండలం సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ సొసైటీ అధ్యక్షులు సర్పంచ్ వెంగల్‌శెట్టి వెంకటయ్య మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని ఉదయగిరి మండల బీసీ సెల్ అధ్యక్షులు బడబాగ్ని నరసింహరాజు బుధవారం తెలిపారు. ఈసందర్భంగా స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని స్థాపించిన నుంచి పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. ఆయన నాయకులకు, కార్యకర్తలకు అనుసంధానకర్తగా ఎన్నో సమస్యలు పరిష్కరించారన్నారు. ఈ సందర్భంగా తెలిపారు నాకు పార్టీ పరంగా వ్యక్తిగతంగా ఎన్నో సాయం సహకారాలు అందించారని అన్నారు. వెంకటయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తున్నాను తెలిపారు. మృతదేహాన్ని సందర్శించి నరసింహరాజు కన్నీరుగా విలపించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో విద్యాప్రదాత డాక్టర్ డిఆర్ వర్ధంతి



**కావలిరూరల్, జనవరి 15 ప్రభాతవార్త:** విద్యాప్రదాత, విద్యాజ్యోతి విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి (డిఆర్) వర్ధంతి వేడుకల సందర్భంగా బుధవారం డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్యర్యంలో కావలి పట్టణంలోని కావేరిగుంట గిరిజన కాలనీలో డాక్టర్ రామ్‌సెంటర్ ఛైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, స్థానికులు తుపాకుల భవాని, రాంబాబు, సుధాకర్ పద్మ, మౌనిక, కాలనీవాసులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రామ్‌సెంటర్ ఛైర్మన్ దొడ్లమనోహర్‌రెడ్డి, డైరక్టర్ కూనంతాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డిలు మాట్లాడారు. డాక్టర్ డిఆర్ పేదరిక నిర్మూలనకు విద్యాసంస్థలు స్థాపించడం జరిగిందన్నారు. డిఆర్ నైతిక విలువలకు, మానవతావిలువలకు నిలువెత్తు నిదర్శనమని తెలియచేశారు. లక్షలాది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన విద్యాప్రదాత డాక్టర్ డిఆర్ అని తెలియచేశారు. బాలకార్మికులుగా ఎవ్వరూ ఉండరాదని, పిల్లలను బాగా చదివించాలని గిరిజనులను కోరారు. అనంతరం డాక్టర్ డిఆర్ ఆశయాలను వివరించి చదువు ప్రాముఖ్యతను తెలియచేశారు. ఈ సందర్భంగా గిరిజనులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందచేయడం జరిగింది.

## పెద్దల పండుగ ఏర్పాట్లు బ్రహ్మాండం













ఫోటోలు : నంద మాల్యాద్రి

## దొడ్ల కోదండరామిరెడ్డి నేతృత్వంలో ముగ్గుల పోటీలు



**బుచ్చి జనవరి 15 ప్రభాతవార్త :** కనుమ పండుగ పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెం మంగళకట్టలో తెలుగు దేశం నాయకులు దొడ్ల కోందరామిరెడ్డి,మాజీ ఎంపిపి దొడ్ల విజయలక్ష్మీ నేతృత్వంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా సమరసతావేదిక నాయకులు నేలనూతల శ్రీదర్ ముఖ్య అతిధిగా పాల్గోన్నారు. ఇప్పగుంట సుధాకర్డ్డి కూడా ముఖ్య అతిధిగా వ్యవహారించారు.ఈ సందర్భంగా నేలనూతల శ్రీదర్ మాట్లాడుతు సాంప్రదాయాలు,సంస్కృతులు ఎప్పటికి మరచిపోకూడదని అన్నారు. పం డుగల వల్ల ఎంతో మందికి ఉపాధీ దొరుకుతుందని అన్నారు. దొడ్ల కోదండరామిరెడ్డి, దొడ్ల విజయలక్ష్మి లాంటి దాతలు మందుకు వచ్చి ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇవ్వడం అభినందనీయమని అన్నారు.అలాగే నగర సంకీర్తన చేసిన మహిళలకు కూడా వారు బహుమతులు అందజేశారు.ఈకార్యక్రమంలో టిడిపినాయకులు ,మంగళకట్ట ప్రజలు పాల్గోన్నారు.

## మెట్టుకూరును కలిసిన టిడిపి నాయకులు



**అనంతసాగరం,జనవరి15,ప్రభాతవార్త:** మండలంలోని లింగంగుంటలో మంగళవారం సంక్రాంతి సంద ర్భంగా మండల టిడిపి నాయకులు నెల్లూరు పార్లమెంట్ తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి కమ్మ ప్రభాకర్నాయుడు , గౌరవరం సర్పంచ్ శాఖమూరి సుబ్బారావ్లు మాజీ ఎన్డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డిని కలిసి నూతన సంవత్సర , సంక్రాంతి శుభాకంక్షలు తెలిపారు. అనంతరం జ్ఞాపికను అందజేశారు .మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆయనతో చర్చించారు.

## టిడిపి హయంలోని మహిళలకు పెద్దపీట

**– సర్వేపల్లి టిడిపి ఐటి విభాగ నాయకులు తిరుమల శెట్టి సతీష్ నాయుడు**



**ముత్తుకూరు, జనవరి 15, ప్రభాతవార్త :** టిడిపి హయాంలోని మహిళలకు పెద్దపీట వేయడం జరుగుతుందని సర్వేపల్లి టిడిపి ఐటి విభాగ నాయకులు తిరుమల శెట్టి సతీష్ నాయుడు అన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని బ్రహ్మ దేవం పంచాయితీలోని గురవయ్య శాలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిం చా రు. గెలుపొందిన మహిళలకు బహుమ తు లు అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ నాయుడు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళుతున్నారు. అలాగే సర్వేపల్లి శాసనసభ్యులు నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ గిరిజన కాలనీలు ఉంటే అక్కడికి వెళ్లి వారి స్థితిగతులు తెలుసుకొని వారికి వెంటనే రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఏర్పాటుకు కృషి చేస్తున్నారన్నారు. మహిళలకు త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉచిత బస్సులు కూడా కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్నారని మహిళలకు తెలిపారు. టిడిపి సభ్యత్వం పొందడం వల్ల చాలా ప్రయోజనం ఉంటుందని ప్రతి ఒక్కరూ టిడిపి సభ్యత్వాన్ని పొందాలని నాయకులకు కార్యకర్తలకు మహిళా నాయకులకు పిలుపునిచ్చారు. అనంతరం సర్వేపల్లి ఐటి విభాగ నాయకుడు సతీష్ నాయుడు దంపతులను మహిళలు సత్కరించారు. 30 మందికి బహుమతి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో నన్నం దీనయ్య, అలిముత్తు, చిల్లకూరు భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ నందయ్య, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఆలిముత్తు, నాటరి నాగేంద్రబాబు, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నావూరుపల్లిలో ముగ్గుల పోటీలు



**పొదలకూరు, జనవరి 15, ప్రభాతవార్త:** మండలంలోని నావూరుపల్లి గ్రామంలో కాకు పవిత్ర ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయుక్తమని ముగ్గుల పోటి విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ గాలంవెంగయ్య అన్నారు. అనంతరం సంక్రాంతి ముత్యాల ముగ్గుల పోటీలో మొదటి బహుమతి సాధించిన చేబ్రోలు పద్మ, ద్వితీయ స్థానంలో కె. లలిత, తృతీయ బహుమతి సాధించిన కాకు ప్రవీణ లకు, అలాగే పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వెంగయ్య మాట్లాడుతూ ముగ్గులు వేయడం మన సంస్కృతిలో ఒక భాగమన్నారు. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా మహిళలకు సంప్రదాయ ముగ్గుల పోటీలను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.ఈ కార్యక్రమానికి స్పాన్సర్ గాలం హరికృష్ణ, న్యాయ నిర్ణేతలుగా ఎ.చంద్రశేఖర్, సుభాష్ వ్యవహరించారు.

## వైభవంగా నాగవరపమ్మకు పూజలు



**కోవూరు జనవరి 15 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ గ్రామ దేవత నాగవరపమ్మ దేవస్థానంలో పుష్యమాస తదియ పర్వదినం సందర్భంగా సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రాత:కాలమునే బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదా యబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా అనిల్కుమార్ , వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

## ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



**కోవూరు జనవరి 15 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో సచివాలయం సమీపంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 20 జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయి. గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు సునీల్రెడ్డి, ఆత్మ మాజీ ఛైర్మన్ సుధాకర్రెడ్డిలు మాట్లాడుతూ ఈ సంక్రాంతి పర్వదినం సందర్భంగా క్రికెట్ పోటీలను గత 20 సంవత్సరాలుగా నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. ప్రత్యేకంగా ఈ సారి 50 ఏళ్ల పైబడిన వారు కూడా ఈ పోటీల్లో పాల్గొని ఉత్సాహంగా యువతను అలరింపజేశారన్నారు. సంస్కృతి సాంప్రదాయాలను మర్చిపోరాదనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాలను తరచుగా నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. ప్రథమ బహుమతి కింద 10 వేలు, ద్వితీయ బహుమతి కింద 5 వేలు, తృతీయ బహుమతి కింద 3 వేలు, నాల్గవ బహుమతి కింద 2 వేలను పంపిణీ చేశారు.

## వైభవంగా శ్రీకామాక్షిదేవి సమేత సంగమేశ్వరుని కొండ తిరుగుడు ఉత్సవం



**సంగం జనవరి 15 ప్రభాతవార్త :** కనుమపండుగ పురస్కరించుకొని మండల కేంద్రమైన సంగంలోని శ్రీకామాక్షిదేవి సమేత సంగమేశ్వరుని కొండ తిరుగుడు ఉత్సవం కన్నుల పండుగగా సాగింది. సంగంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుండి ప్రారంభమైన కొండ తిరుగుడు ఉత్సవం కొరిమెర్ల, తలుపూ రుపాడు, తరుణవాయి, గ్రామాలల్లో ఊరేగనన్ను కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి కొండ తిరుగుడు ఉత్సవాన్ని ఆయా గ్రామాల ప్రజలు ఆనందోత్సహాలతో అత్యంత భక్తి శ్రద్దలతో తమ గ్రామాలకు భజా భజత్రీలతో ఆహ్వానించారుజ సిఐ వేమారెడ్డి,ఎస్ఐ రాజేష్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## చివరికి మాజీ మంత్రి కాకాణి బ్రతుకే ఫేక్ అవుతుంది



**పొదలకూరు, జనవరి 15, ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి ఎవరు తెలుగుదేశం పార్టీలో చేరినా, అది కాకాణికి ఫేక్ లాగే కనిపిస్తుందని, ఆ మాటలు కూడా ఆయనకి ఫేక్ మాటలు లాగే వినిపిస్తాయని కాకాణి అంగవైకల్యంతో బాధపడుతున్నట్లు అమ్మవారి పాలెం టీడీపీ సీనియర్ నాయకులు అద్దంకి గిరినాయుడు అన్నారు. మంగళవారం అమ్మవారిపాలెం ఎస్సీ కాలనీలో ఇటీవల వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్న కుటుంబాలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలో నూతనంగా చేరిన కర్నాటి పెంచలయ్య, తిరుపతయ్య (మాజీ ఎంపీటీసీ), కర్నాటి నారాయణ, బాబు, చిన్న పెంచలయ్య, అయ్యప్ప, మైల పెంచలయ్య, ఉమా మహేశ్వర్ తదితరులు మీడియాతో మాట్లాడుతూ తమని మాజీ మంత్రి కాకాణి సోషల్ మీడియా పోస్ట్ చేసినట్లు ఎవరూ బలవంతం చేయలేదని, పార్టీలో చేరకపోతే పథకాలు రావని ఎవరూ చెప్పలేదని వెల్లడించారు. సోమిరెడ్డి అభివృద్ధిని చూసి తామే పార్టీలోకి స్వతంత్రంగా వచ్చినట్లు తెలిపారు. అలాగే 2021 నుంచి తాము వైసిపిలో ఉంటే వైసీపీ ప్రభుత్వంలో తమకి కానీ, తమ కాలనీకిగానీ ఎటువంటి ప్రయోజనం జరగలేదన్నారు. మాటలతో కాలయాపన చేశారన్నారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఓడినా, గెలిచినా తమ కాలనీకి రోడ్లు, దేవాలయం, ఇల్లు మంజూరు చేయించారని, అందుకనే అభివృద్ధిని చూసి తాము పార్టీలోకి వచ్చినట్లు మీడియా ముందు ఒక్కొక్కరుగా వచ్చి తెలిపారు. అనంతరం అమ్మవారిపాలెం టిడిపి సీనియర్ నాయకులు గిరినాయుడు, కొమ్మి రమేష్ నాయుడు, వడ్లమూడి వెంకటేశ్వర్లు (నీటి పారుదల సంఘం అధ్యక్షులు) మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణికి వైసీపీ వీడిన వారి మాటలన్నీ ఫేక్గా కనిపిస్తాయని, వినిపిస్తాయని ఎద్దేవా చేశారు. చివరికి కొన్ని రోజులు పోతే తాను ఓడిపోయింది కూడా ఫేక్ అని విమర్శించారు. అవినీతిలో జగన్కి ప్రియ శిష్యుడు అయ్యారని, శాండ్, మైన్, వైన్, గ్రావెల్, క్వార్జ్, బూడిద ఇలా దేన్ని వదలకుండా అక్రమార్జనలోనూ, జనాలపై తప్పుడు కేసులు బనాయించడంలో మాజీ సీ.ఎం జగన్కు ప్రియ శిష్యుడని అన్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గెలిచిన కొద్ది రోజుల్లోనే అభివృద్ధిని పరుగులెత్తిస్తున్నారని, ఇప్పటికే రోడ్లు, దేవాలయం కట్టించిన ఈఎస్సీ కాలనీలో త్వరలో కమిటీ హాల్ కట్టిస్తున్నారని, ఎన్నో ఏళ్ళ నుంచి పెండింగ్ లో వున్న దక్షిణ కాలువను పూర్తి చేసి 4 వేల ఎకరాలకు నీళ్లు అందిస్తున్నారన్నారు. అభివృద్ధిని చూసి ప్రజలు వైసీపీని వీడి టిడిపిలో చేరుతుంటే, మాజీ మంత్రి కాకాణికి నిద్ర పట్టడం లేదని, అవంతా ఫేక్ న్యూస్ అంటూ ఓ మాజీ మంత్రిగా స్థాయి తగ్గించుకొని సోషల్ మీడియాలో ఆయనే ఆయనే ఫేక్ ప్రచారాలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా అనవసరమైన ప్రేలాపనలు మాని అభివృద్ధికి సహకరించాలని లేదంటే చివరికి కాకాణి భవిష్యత్తు బ్రతుకు కూడా ఫేక్ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రావులపల్లి సురేష్ నాయుడు (విద్యా కమిటి ఛైర్మన్), పులిపాటి సీతారామయ్య, పూర్ణచంద్ర నాయుడు, కొమ్మి వెంకటేశ్వర్లు, అద్దంకి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## తిక్కవరంలో మెగా రక్తదాన శిబిరం



**మర్రిపాడు, జనవరి15,ప్రభాతవార్త:** సంక్రాంతి సందర్భంగా ఇనుకుర్తి నాగార్జున జ్ఞాపకార్థం సంక్రాంతి సందర్భంగా నెల్లూరు రెడ్క్రాస్ సహకారంతో మర్రిపాడు మండలం తిక్కవరంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరంలో ఎస్ఐ శ్రీనివాసరావ్, మండల వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ లు పాల్గొని రక్తదా న శిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులను, రక్తదానం చేసిన దాతలను అభినందించారు. అనంతరం రెడ్క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాసరావ్ను, వైద్యాధికారి గోపినాథ్ను మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా యువత ఇతర చెడు వ్యసనాలజోలికి పోకుండా ఇలాంటి సేవాకార్యక్రమాలు చేయడం మంచి కార్యక్రమమన్నారు. రక్తదానం చేయడం వలన ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ఎంతో సహాయపడినవారవుతారన్నారు. ఈకార్య క్రమంలో వైసిపి నాయకులు గంగవరపు శ్రీనివాసులునాయుడు, నిర్వాహకులు చంద్ర నారాయణస్వామి , గంగినేని రవీంద్రబాబు, గంగినేని విజయ్కుమార్, బోయపాటి నాగేశ్వరరావ్, బత్తిన సుధాకర్, గంగవరపు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ముగ్గుల పోటీలు

**మర్రిపాడు,జనవరి15,ప్రభాతవార్త:** మండలంలోని తిక్కవరంలో గ్రామ యువత ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి మహిళలు ఉత్సాహంగా పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధరకాల ముగ్గులను వేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ పాల్గొన్నారు. విజేతలకు డాక్టర్ గోపినాథ్ బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా సాంప్రదాయాలను గుర్తు చేస్తూ నిర్వాహకులు ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో చంద్ర నారాయణస్వామి, గంగినేని విజయ్కుమార్, గంగినేని రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు..

## నందవరంలో వాలీబాల్ టోర్నమెంట్

**మర్రిపాడు,జనవరి15,ప్రభాతవార్త:** సంక్రాంతి సందర్భంగా మండలంలోని నందవరంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. యువత ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో 8జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీ జరిగిన ఈ పోటీల్లో వెంగంపల్లి జట్టుపై మర్రిపాడు జట్టు విజయం సాధించింది. ఫైనల్లో విజయం సాధించిన మర్రిపాడు జట్టుకు 4116రూపాయలు నగదును అందించారు. రన్నర్ ఆఫ్గా నిలిచిన వెంగంపల్లి జట్టుకు 2116 రూపాయలను నిర్వాహకులు అందజేశారు. ఈకార్యక్రమంలో యువత పాల్గొన్నారు.

## రైలు ఢీ.. యువకుడు మృతి



**కోవూరు జనవరి 15 ప్రభాతవార్త :** కోవూరులోని పడుగుపాడు రైల్వే స్టేషన్ పరిధిలో 178/18 కి.మీ వద్ద డౌన్లైన్లో బుధవారం ఏ. బాలాజీ(21) రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు సమాచారాం తెలుసుకున్న రైల్వే ఎస్సై రమాదేవి సంఘటనా స్థలానికి చేరుకుని పూర్తి వివరాలు పరిశీలించారు. బాలాజీ కోవూరు ప్రాంతానికి చెందిన వాడని గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

## పల్లెల్లో ముగిసిన సంక్రాతి వేడుకలు

**బిట్రగుంట జనవరి 15 ప్రభాతవార్త:** బోగోలు మండలం లో సంక్రాతి వేడుకలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. సూదురాప్రాంతాలనుండి వచ్చి బంధుమిత్రులులతో పల్లెటూరులలో సంక్రాతిసంబరాలాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సంక్రాతిని పురస్కరించుకొని గ్రామాలలో నిర్వహించిన క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరినించాయి.

## హిందూధర్మం నిలబడాలంటే అందరు వేదపురాణాలు చదవాలి



**సంగం జనవరి 15 ప్రభాతవార్త :** సంగం తిరమనకొండపైన శ్రీరాజరాజేశ్వరీదేవి జ్ఞానపీఠంలో సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక పూజలు,యజ్ఞం నిర్వహించారు. పీఠాదిపతులు రాజరాజేశ్వరానందస్వామి భక్తుల నుద్దేశించి మాట్లాడుతు పుష్యమాసంలో సూర్యభగవానుడు మకరరాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణమని చెప్పారు. సంక్రాంతిని ప్రజలు గొప్ప పండుగగా చేసుకుంటారని స్వామి వివరించారు. బోగి పండుగ అందరికి ఆరోగ్యప్రదమని అన్నారు. హిందూ సోదరి సోదరులందరు 4 వేదాలు, 108 ఉపనిషత్తులు,18 పురాణాలు, భగవత్గీత చదవడం,వినడం, వలన ఆత్మ వికాశం జరుగుతుందని స్వామి వివరించారు.భగవత్ గీత చదవడం వల్ల,వినడం వల్ల ఆత్మ వికాశం జరుగుతుందని అన్నారు. కుటుంబ వ్యవస్థలో కట్టుబొట్టు, నీతినియమాలు,ధర్మాలు తెలుస్తాయని ప్రతి ఒక్కరు భగవత్గీత చదవాని ఆయన సూచించారు.ఈకార్యక్రమంలో భక్తులు పాల్గోన్నారు.

## కడుపు నొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

**బిట్రగుంట జనవరి 15 ప్రభాతవార్త:** బోగోలు మండలం జక్కెపల్లిగూడూరు గ్రామంలో కడుపునొప్పి భరించలేక పేరం. కృష్ణమ్మ (56)అనే వివాహిత పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకొన్నట్లు మృతురాలి భర్త అయిన పేరం రఘురామిరెడ్డి బుధవారం పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు.పిర్యాది దారి కథనం మేరకు 5 సంవత్సరాలనుండి గుండె నొప్పి, కడుపు నొప్పి తో భాద పడుతూ నెల్లూరు లోని అపోలో హాస్పిటల్ నందు డిఆర్.భక్తవత్సల రెడ్డి వద్ద చికిత్స పొందుచు,, అప్పుడప్పుడు నొప్పిని భరించలేక ఉన్నాను చనిపోవడమే మేలు అని అంటుండి నట్లు అదే క్రమంలో తేది 14.01.25 దినం సంక్రాతి పండుగ సందర్భంగా తన ఇద్దరు కుమారులు, కోడళ్ళు ఇంటికి వచ్చి నట్లు,ఈ క్రమం లో సదరు కిష్టమ్మ కు కడుపు నొప్పి వచ్చి భరించలేక తన అనారోగ్యం ను తలచుకొనిమనసుకి భాద కలిగి చనిపోవాలనే ఉద్దేశం తన ఇంటిలో ఉన్న పురుగుల మందు తాగింది అని పేర్కొన్నారు.అంతట వెంటనే కుటుంబ సభ్యులు నెల్లూరు లోని అపోలో హాస్పిటల్ లో చేర్పించగా చికిత్స పొందుచు రాత్రి 11:15 గంటలకు చనిపోయినట్లు ఫిర్యాదు లో పేర్కొన్నారు. కేసును ఏఎస్ఐ,సి హెచ్. సుధాకర్ రెడ్డి నమోదు చేసి, దర్యాప్తు చేయుచున్నారు.

## భారీ స్థాయిలో ముగ్గుల పోటీలు



**కోవూరు జనవరి 15 ప్రభాతవార్త :** కోవూరులోని చెన్నకేశవ స్వామి దేవస్థాన ప్రాంగణంలో కనుమ పండుగ సందర్భంగా బుధవారం మహిళలకు భారీస్థాయిలో ముగ్గుల పోటీలను చేపట్టారు. ఈ ముగ్గుల పోటీల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు భారీస్థాయిలో బహుమతులను నిర్వాహకులకు పంపిణీ చేశారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

## కండలేరులో 56.040 టీయంసీల నిటిమట్టం



**కండలేరుడ్యాం(రాపూరు),జనవరి15ప్రభాతవార్త :** మండలంలోని కండలేరు జళాశయంలో బుదవారం ఉదయానికి 56.040 టీయంసీల నిటిమట్టం నమొదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఇందులో సోమశిల.కండలేరు వరద కాలువ ద్వారా 180 క్యూసెక్కులు ఇన్ఫ్లోగా జళాశయంలోకి వస్తుం డగా అవుట్ఫ్లోగా జళాశయం హెడ్ రెగ్యులేటర్ నుండి 925 క్యూసెక్కులు,1వ బ్రాంచి కెనాల్ ద్వారా 70 క్యూసెక్కులు,లో లెవల్ స్లూయిస్ ద్వారా 10 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 110 క్యూసెక్కుల చొప్పున మొత్తం 1045 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

## పెంచలకోనలో వైభవంగా గోపూజ

**పెంచలకోన(రాపూరు),జనవరి15ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో కనుమ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకోని గోపూజ నిర్వహించారు. ఇందులో బాగంగా ఉదయం స్వామి వారి ఆలయ ప్రధాన ద్వారం ముందు గోవులకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామి వారి గోశాలలోని గోవులకు పసుపు,కుంకుమలతో పూజలు చేసి గోపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి,అర్చక స్వాములు శశి స్వామి, ఆలయ సీనియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

## చెన్ను సోదరులకు పలువురి సత్కారం



**తానంచర్ల(రాపూరు),జనవరి15ప్రభాతవార్త :** రాపూరు మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులైన చెన్ను సోదరులకు పలువురు ఆత్మీయ సత్కారాలు నిర్వహించారు. యువనాయకులు, చెన్ను సోదరులైన పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, యువ నాయకుడు చెన్ను అశోక్ రెడ్డి,సోసైటీ మాజీ ఛైర్మన్ చెన్ను బాస్కర రెడ్డిలను తానంచర్ల గ్రామంలోని చెన్ను గార్డెన్స్లో పలువువురు నాయకులు కలుసుకోని చిరు సత్కారాలు నిర్వహించారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండలంలోని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు,జనసేన నాయకులు చెన్ను సోదరులను కలుసుకోని వారికి శాలువాలు కప్పి,సత్కరించి వారికి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలను తెలిపారు. పెద్ద ఎత్తున వచ్చిన నాయకులతో చెన్ను గార్డన్స్లో పండుగ మరింత విశిష్టతగా మరింది.

## సంస్కృతి,సాంప్రదాయాలను కాపాడుకునేందుకే ముగ్గుల పోటీలు



**నవాబుపేట(రాపూరు),జనవరి15ప్రభాతవార్త :** భావి తరాలకు మన సాంస్కృతి,సంప్రదాయాలను తెలియ చేప్పేందుకే ముగ్గులు పోటీలు నిర్వహించినట్లు సేవా భారతి ట్రస్ట్ నిర్వహకులు తెలిపారు. సంక్రాంతి పండు గను పురస్కరించుకోని రాపూరు పంచాయితీ పరిధిలోని నవాబుపేట గ్రామంలో బుదవారం ముగ్గుల పోటీలను సేవా భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలలో గెలుపోందిన వారికి బహుమతులను ఆందజేశారు. నిర్వహకులు మాట్లాడుతూ మరచిపోతున్న మన సాంప్రదాయాలను గుర్తుచేసేందుకు ఈ పోటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పోటీలలో మొదటి బహుమతి దాసరి కళ్యాణ్,ద్వితీయ బహుమది రేవూరు అమృత, తృతీయ బహుమతి పల్లి స్వాతిలు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో రాఘవ రెడ్డి,భ్రమరాంబికా సేవా ప్రముఖ బ్రహ్మయ్య, శివకుమార్, శ్రీను తదితరులున్నారు.

## వైసిపి మండల అధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డికి సన్మానం



**బుచ్చి జనవరి 15 ప్రభాతవార్త** రెండోవసారి బుచ్చిరెడ్డిపాళెం మండల వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులుగా నియమితులైన చెర్లో సతీష్‌రెడ్డిని బుచ్చిలోని పార్టీ కార్యాలయంలో నాయకులు కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కాగులుపాడు పంచాయితీకి చెందిన జెసిఎస్ కన్వీనర్ బిల్లా వినోద్‌కుమార్, మూగ వెంకటరమణయ్య, ఏరాజుల శ్రీను,దాసరి శ్రీహరి, అమవరపు మురళీ, పయనవం వెంకి యువత పూలమాలలు వేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఇంతమంది ముగ్గుల పోటీలలో పాల్గొనడం ఆశ్చర్యం



**నెల్లూరు, జనవరి 15, ప్రభాతవార్త-వైద్యం** తను ఎన్నో ముగ్గుల పోటీలు చూశాను, ఇంత మంది మహిళలు ముగ్గుల పోటీలలో పాల్గొనడం తాను ఎక్కడ చూడలేదని, మహిళలో నూతన ఉత్సాహానికి ఇది తార్కాణం అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని 13వ డివిజన్ యనమల వారిదిన్నెలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఆమె ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈసందర్భంగా రమాదేవి మాట్లాడుతూ 250 మంది మహిళలు ముగ్గుల పోటీలలో పాల్గొనడం ఇదే ప్రథమం అన్నారు. తాను ఎన్నో ముగ్గుల పోటీలను చూశానని, అయితే ఇంత పెద్ద ఎత్తున వేసిన ముగ్గులను చూడలేదన్నారు. ముగ్గు చిన్నదా పెద్దదా అన్నది కాదని ముగ్గు ఎలా ఉన్నదే ప్రధానమనే అన్నారు. ముగ్గులు ఒక దాన్ని మించి ఒకటి ఉన్నాయని వీరిలో ముగ్గురిని ఎంపిక చేయడం చాలాకష్టతరమవుతుందన్నారు. ముఖ్యంగా నారాయణ సార్ దత్తత తీసుకున్న 13వ డివిజన్లో ముగ్గుల పోటీలు జరగడం విశేషం అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు ఆమె ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం ముగ్గులను పరిశీలించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. 13వ డివిజన్ యలమవారిదిన్నెలో నగర తెలుగు యువత నాయకులు దానా మహేష్, వైడి యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంక్రాంతి ముగ్గుల పోటీల కార్యక్రమంలో పేనేటి మరియదాసు, కాయల తిరుపతి, పేనేటి జనార్ధన్, కాయల మధు, మీదూరి హిమామాస్, ఇంద్రనిల్, శ్రీనివాసులురెడ్డి, దానా చందన, వైడి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## నృసింహుని సేవలో కొండవీటీ జ్యోతిర్మయి



**పెంచలకోన (రాపూరు), జనవరి15 ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారిని బుధవారం ప్రముఖ ఆధ్యాత్మిక గాయని కొండవీటి జ్యోతిర్మయి దర్శించుకున్నారు. కోనకు వచ్చిన ఆమె శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామిని, శ్రీ ఆధిలక్ష్మీ అమ్మవారిని, శ్రీ అంజనేయ స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి కళ్యాణోత్సవంలో ఆమె పోల్గోని పలు నృసింహ స్వామి కీర్తనలు ఆలాపించి భక్తులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అర్చక స్వాములు ఆశీర్వచనాలు ఆందజేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను ఆందజేశారు.రాఘవ రెడ్డి, ఈ కార్యక్రమంలో రాఘవ రెడ్డి,ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, శశి స్వామి తదితరులున్నారు.

## ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రధానం



**నెల్లూరు,జనవరి15 ప్రభాతవార్త-విద్య** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నెల్లూరు సిటి వాసవి క్లబ్,రంగనాథ నగర్ వాస్తవ్యుల ఆధ్వర్యంలో స్థానిక రంగనాథనగర్‌లో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేవారు. శుబమస్తు,పెరుమాళ్ సిల్క్స్ అధినేతలను బయ్యా రవికుమార్ చేతులమీదుగా విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి శారద కి గా రూ.4వేల విలువైన పట్టుచీర, ద్వితీయ బహుమతి ఎం.రామాదేవికి రూ.3వేల విలువ గలిగిన పట్టుచీర, తృతీయ బహుమతి మయూరి సుధకి రూ. 2వేల విలువగల పట్టుచీర, నాలుగు,ఐదు, ఆరు బహుమతుల గెలుచుకున్న వారికి వేయిరూపాయల విలువైన ప్యాన్సీ చీరలను ఒక్కొక్కరికి ప్రదానం చేయటం జరిగింది. అలాగే రాచపుటి వినోద్ ఆధ్వర్యంలో గోదుమపిండి,పబ్బిశెట్టి సూపర్‌మార్కెట్ సౌజన్యంతో బాంబినో సెమియాలను విజేతకలు అందజేశారు. ఈ పోటీలకు న్యానిర్ణేతలుగా భయ్యా మల్లికా, శ్రీరామ్ పుష్పలత చలువాది రజిని లు వ్యవహరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతు గత రెండు సంవత్సరాలుగా తాము ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం 140మందికి పైగా మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. తమకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చలువాది నాగేశ్వరరావు, పాదర్తి బాలాజీ, పబ్బిశెట్టి నందకిషోర్, చలువాది వెంకటేశ్వరరావు, పబ్బిశెట్టి లీలా మెహన్, మెంటా రమేష్, నిడమనూరు నరసింహరావు, పాదర్తి సుబ్రమణ్యం, రవ్వ రమేష్, మెటా కిరణ్‌కుమార్, దేవతి సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ సీనియర్ నాయకులు శివాజీకి ఘన సన్మానం



**ఉదయగిరి, జనవరి 15, ప్రభాతవార్త** పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో నివాసం ఉంటున్న బీజేపీ సీనియర్ నాయకులు దివంగత మాదాల కుటుంబ సభ్యులు మాదాల శివాజీని ఉదయగిరి బీజేపీ నాయకులు ముడమాల రమేష్‌రెడ్డి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో తొలుతగా బీజీపీని బలోపేతం చేసేందుకు జెండా మోసిన వ్యక్తులు మాదాల మల్లయ్య, రాచయ్య అని కొనియాడారు. వీరి త్యాగాలు నియోజకవర్గ ప్రజలు మరువలేనివన్నారు. ఉదయగిరి ఆర్టీసీ డిపో ఏర్పాటుకు ఆ రోజుల్లో ఆయన సొంత భూమిని ఇచ్చిన మహనీయుడని కొనియాడారు. మండల ప్రజలు మాదాల రాచ్చయ్యని స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన కొనియాడారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవుల రోశయ్య యాదవ్ పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆర్చరీ పోటీలకు జిల్లా జట్ల ఎంపికలు

**నెల్లూరు,జనవరి 15 ప్రభాతవార్త-విద్య** ఈనెల 23నుండి 25 వరకు విజయవాడలోని మాచవరం ఎస్ఎస్ఆర్,సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న 44వ ఎన్‌టిపిసి జూనియర్, ఇండియన్,రికర్వ్, కాంఫౌడ్ రౌండ్స్ ఆర్చరీ చాంఫియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా జట్లు ఎంపికలను ఈనెల 19న ఆదివారం నగరంలోని స్థానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో నిర్వహిచనున్నామని జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష్య,కార్యదర్శులు పల్లంరెడ్డిశ్రీహర్ష, పావురాల వేణులు పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొన దలచిన క్రీడాకారులు వారివారి వయస్సు ధృవీకరణ పత్రం, ఆదార్‌కార్డు వివరాలతో ఎంపికలను హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9441955334 కు కాల్ చేయ్యాలని వారు కోరారు.

## హిందూ మనోభావాలనె దెబ్బతీసిన ఉదిత్ రాజ్



**నెల్లూరు, జనవరి 15, ప్రభాతవార్త-వైద్యం** కుంభమేళా భారతీయ సంస్కృతికి ప్రతీక అని, దానిపై కాంగ్రెస్ నేత ఉదిత్ రాజ్ చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి చిలక ప్రవీణ్ కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలో ప్రవీణ్ కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేత ఉదిత్ రాజ్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. కుంభమేళా వంటి పవిత్రమైన హిందూ ధార్మిక వేడుకలపై చేసిన వ్యాఖ్యలు బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కుంభమేళా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకన్నాడు. ఇది పాప క్షయానికి మాత్రమే కాదని, ఆధ్యాత్మికతను పెంపొందించే మహాసంగమమని, భక్తుల విశ్వాసాలపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం హిందూ సమాజాన్ని కించపరచడమే కాకుండా, వారి మనోభావాలను దెబ్బతీయడమేనని ప్రవీణ్ అన్నారు. కుంభమేళా భారతదేశంలో అత్యంత ప్రాచీనమైన, ప్రతిష్ఠాత్మకమైన పండుగ. ప్రతి 12 సంవత్సరాలకు ఒక సారి ప్రయాగ్ రాజ్, హరిద్వార్, ఉజ్జయిని, మరియు నాసిక్‌లలో నిర్వహించబడుతుందని, భక్తులు పవిత్ర నదుల్లో స్నానం చేయడం ద్వారా పాప విముక్తి, మోక్షాన్ని పొందుతారని నమ్ముతారు. ఈ పండుగ యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం పొందిందని ఆయన వివరించారు. ప్రపంచంలోని అతి పెద్ద మతపరమైన సమావేశంలో ప్రసిద్ధి చెందిన కుంభమేళాలకు కోట్లాది భక్తులు హాజరవుతారని చిలక వెల్లడించారు. మతపరమైన అంశాలను రాజకీయ లబ్ది కోసం ఉపయోగించడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని, భారతీయ జనతా పార్టీ ప్రజల ఆధ్యాత్మిక భావాలను గౌరవిస్తూ, వారి విశ్వాసాల పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని, ఉదిత్ రాజ్ హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## కోవూరుపల్లి వద్ద చీకటి వ్యాపారం



**బిట్రగుంట జనవరి 15 ప్రభాతవార్త:** బోగోలు మండలం కోవూరుపల్లి గిరిజనకాలనీ వద్ద బొగ్గుపొడి లో బూడిద కలిపి కల్తీ చీకటి వ్యాపారం జోరుగా సాగుతోంది. రాత్రుల సమయంలో వేరే చోటినుండి ఇక్కడకు బొగ్గు పొడి ని తీసుకువచ్చి అందులో బూడిద కల్తీ చేసి రవాణా చేస్తున్నారు. ఇందులో ప్రతిపక్షం పార్టీ నేతల ప్రమేయం తో లక్షలు గడిస్తున్నారు. జాతీయ రహదారి కూతవేటు దూరంలో ఈ చీకటి వ్యాపారం సాగుతున్న అధికారులు చర్యలు తీసుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి.

## వైభవంగా పల్లకి సేవ





**కోవూరు జనవరి 15 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రాతఃకాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయ బద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా తాటిపర్తి విజయకుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఉభయకర్తలుగా పెద్ది ప్రభావతి జ్ఞాపకార్థం కుమారుడు నాగార్జున కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

## రాపూరులో వైభవంగా అయ్యప్ప స్వామి మకరజ్యోతి



**రాపూరు, జనవరి15వభాతవార్త** మహాసంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకోని మంగళవారం రాపూరులోని శ్రీశ్రీశ్రీ మహావిష్ణు, శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో అయ్యప్ప స్వామి వారి మకర జ్యోతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఇందులో బాగంగా ఉదయం స్వామి వారి ఆలయంలో మూలమూర్తులకు అభిషేకం,పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక అలంకారం,పూజలు నిర్వహించారు.అనంతరం 14కేజిలతో అయ్యప్ప జ్యోతి వెలిగించి జ్యోతి కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గోని స్వామి వారి జ్యోతి కార్యక్రమంలో పాల్గోని స్వామి వారి జ్యోతిని దర్శించుకోని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## కలువాయమ్మ తల్లి ....కరుణించమ్మ



**కలువాయి జనవరి 15 ప్రభాతవార్త** కలువాయమ్మ తల్లి.... కరుణించుతల్లి.... అంటు భక్తి పారవశ్యంతో అమ్మవారిని కనులారా చూసి దర్శించుకొని భక్తులు పరవశించిపోయారు. సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని కలువాయి గ్రామశక్తి స్వరూపిని శ్రీకలువాయమ్మ అమ్మవారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీకలువాయమ్మ అమ్మవారితోపాటు సోదరీ,సోదరుడైన మాతమ్మ తల్లి,పోతురాజు, ఉత్సవమూర్తులను అమ్మవారి ఉత్సవ రథంపై విశేషంగా అలంకరించారు. మంగళవాయిద్యాలతో భాజాభజంత్రీలతో గ్రామం అంతా ఉత్సవాన్ని నిర్వహించగా ఇంటింటి వద్ద అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. అదే విధంగా శ్రీదేవి,భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాన్ని నిర్వాహకులు వైభవంగా నిర్వహించగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

## వింజమూరులో కోదండరామస్వామి గ్రామోత్సవం



**వింజమూరు, జనవరి15, ప్రభాతవార్త:** సంక్రాంతి సందర్భంగా మూడువ రోజైన కనుమ రోజు అయిన బుధవారం వింజమూరులోని ఆర్యవైశ్య సంఘంఆధ్వర్యంలో వైశ్య బజార్‌లోని శ్రీకోదండ రామస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారికి ఉదయాన్నే ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకిపై అధిష్టించారు. భక్తులు స్వామివారిని మోసేందుకు భక్తి శ్రద్ధలతో ముందుకు వచ్చారు. జై శ్రీరామ్ అంటూ నినాదాలతో స్వామివారిని ఊరేగించారు. భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా జరిగిన గ్రామదేవత గ్రామోత్సవం

**కావలి, జనవరి15 ప్రభాతవార్త** కావలి గ్రామదేవత శ్రీ కళుగోళశాంభవిమాత గ్రామోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. మంగళవారంరాత్రి ఆలయంనుంచి బయలుదేరిన అమ్మవారి గ్రామోత్సవం బుధవారం రాత్రికి ఆలయానికి చేరుకుంది. విద్యుత్ దేదీప్యమాన అలంకారాలతో, విశేషపూలమాలలతో అమ్మవారిని అలంకరించి సాగిన గ్రామోత్సవాన్ని భక్తులు దర్శించుకుని తరించారు. అమ్మవారి గ్రామోత్సవం పలు ప్రాంతాలమీదుగా సాగింది. భక్తులు ప్రతి వీధిలో అమ్మవారికి హారతులిచ్చారు. పోలీసుబందోబస్తు మధ్య అమ్మవారి గ్రామోత్సవం సాగింది. గ్రామోత్సవాన్ని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ప్రారంభించారు. గ్రామోత్సవంలో చీరాల తప్పెట్లు, కావలి వాయిద్యాలు, నెమలిఆట, మాతంగి, బొల్లిఆవులు, భజంత్రీలతో కోలాహలంగా సాగింది.

## తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకూడదు



**నెల్లూరు, జనవరి 15, ప్రభాతవార్త-వైద్యం** ప్రపంచంలో బిడ్డల బాగుకోరేది ఒక తల్లిదండ్రులు మాత్రమేనని, వారిని నిర్లక్ష్యం చేకూడదని నిన్ను డవలప్‌మెంట్ అధారిటి చైర్మన్ కోటం రెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని బాలాజీ నగర్‌లో శ్రీనివాసులురెడ్డి స్నేహితులైన వెంకటేశ్వర్లు సత్యనారాయణ ఆధ్వర్యంలో వారి తల్లిదండ్రులైన కాబోలు పున్నయ్య పద్మావతి పేర్ల మీద చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు నేర్పిన క్రమశిక్షణ, వారి రెక్కల కష్టం వల్లే అందరూ జీవితంలో పైకి వస్తారని, అలాంటి తల్లిదండ్రులను ఎవరు నిర్లక్ష్యం చేయవద్దని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కోరారు. వృద్ధాప్యంలో వారికి అండగా ఉండటంతో పాటు చనిపోయిన తర్వాత వారిని స్మరించుకోవడం మన బాధ్యత అని ఆయన అన్నారు. చనిపోయిన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విషయం అని కొనియాడారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు భవిష్యత్తులో మరెన్నో చేయాలని తన స్నేహితులు వెంకటేశ్వర్లు సత్యనారాయణలకు సూచించారు. తల్లిదండ్రులు కనిపించే దేవుళ్ళు అని, వారికి బతికి ఉన్నప్పుడు సేవ చేయడం, చనిపోయిన తర్వాత స్మరించుకోవడం బిడ్డల బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండా ప్రవీణ్, కొవ్వూరపు బాలాజీ, అల్లూరి శ్రీనివాస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న అంకినపల్లి



**వింజమూరు, జనవరి15, ప్రభాతవార్త:** తెలుగుదేశం శాశ్వత సభ్యత్వం పట్ల ఆసక్తి చూపాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. అందులో భాగంగా ఎఫ్‌సిఐ మాజీ డైరెక్టర్ అంకినపల్లి ఓబుల్‌రెడ్డి సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం టిడిపి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. స్థానిక మండల టిడిపి కార్యాలయంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాధరెడ్డి జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, పట్టణ అధ్యక్షులు కోడూరు నాగిరెడ్డి, ఇతర నేతల సమక్షంలో శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిఅనే రెండు కళ్ళతో రాష్ట్రాన్ని ముందుకు నడుపుతున్నారన్నారు. పాలనపై అపారమైన నమ్మకంతో అదే విధంగా నారా లోకేష్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఉదయగిరి నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధిని సాధిస్తుందన్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని ఈప్రాంత యువతకు ఉద్యోగ ఉపాది అవకాశాలు కల్పించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మెన్ జూపల్లి రాజారావ్, సుబ్బరాయుడు, శివ, ఎంఎస్ నాయుడు, మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి , పెరుమాళ్ళు, పలసాని నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పక్కేళ్లమ్మ తల్లి దయ గ్రామస్తులపై ఉండాలి





**కోవూరు జనవరి 15 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం పంచాయతీలోని గ్రామ దేవత పక్కేళ్లమ్మ దేవాలయంలో బుధవారం అమ్మవారికి గూటూరు కుటుంబీకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో , పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో పూజలు అనంతరం భారీస్థాయిలో అన్నదానం కార్యక్రమాన్ని గూటూరు కుటుంబీకుల ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గూటూరు శ్రీధర్ నాయుడు మాట్లాడుతూ పక్కేళ్లమ్మ తల్లి దయ గ్రామస్తులపై ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం తప్పకుండా ఈ కార్యక్రమాన్ని దేవస్థాన ప్రాంగణంలో నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. గ్రామంలోని రైతులు కూడా తమ పంటలు బాగా పండి సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి ప్రార్థించడం జరిగిందన్నారు. వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు యాక్సిడెంట్‌లపై అవగాహన



**ఉదయగిరి, జనవరి 15, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి పట్టణం నందు బైకులపై వెళ్లే వాహనదారులకు బుధవారం ఉదయగిరి ట్యాంక్ బాండ్ సమీపంలో వాహనదారులకు ఎస్సై ఇంద్రసేనారెడ్డి హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను నడిపే ప్రతి ఒక్క వ్యక్తి హెల్మెట్ ధరించాలని రోడ్డుపై వెళ్తున్నప్పుడు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలని ఆయన అన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అతి వేగంగా వెళ్ళవద్దని ఆయన సూచించారు. మనం ఎప్పుడైనా గాని వాహనం, నడిపేటప్పుడు ఎదుటి వాహనాన్ని చూచి జాగ్రత్తగా నడిపినచో యాక్సిడెంట్లను నియంత్రించవచ్చని ఆయన అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను గుర్తించిన వెంటనే గంటలోపు గోల్డెన్ అవర్ సమీపంలోని ఆసుపత్రికి తరలించి ప్రాణాన్ని కాపాడే వ్యక్తికి ప్రభుత్వం ప్రోత్సాహకం ఉంటుందని ఉదయగిరి ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.